సాక్షి
జనగామ
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



వేతనం రికవరీ చేయాల్సిందే!
విధులకు గైర్హాజరు అయిన యూనియన్ నేత జీతం రికవరీ చేయాలని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం నిర్ణయించింది.
- 8లో▸



రైతులకు అండగా ఉంటాం..
అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
37^0 /23^0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అక్రమ అరెస్టులు సరికాదు

జనగామ: బీఆర్‌ఎస్ నేతలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడిన బూతు పురాణాలకు నిరసనగా షోడాషపల్లిలో శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపిన తమ పార్టీ నాయకులు, గ్రామస్తులను అధికార పార్టీ నేతలు పోలీసులను పంపించి అరెస్ట్ చేయించారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. కడియం శ్రీహరి గులాబీ జెండా నీడలో కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, ఎంపీ హోదా అనుభవించిన సంగతి మరువొద్దన్నారు. కడియం అహంకారం, అల్పబుద్ధితో స్టేషన్‌ఘన్‌పూర్ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. ఘన్‌పూర్ ప్రజలు ఉప ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని, ఓట్ల పండగ రాగానే పాతాళంలోకి తొక్కేయడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతీ పౌరుడికి ఉంటుందని, చట్ట విరుద్ధంగా తనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులను తిట్టిన కడియం శ్రీహరిపై వెంటనే కేసు నమోదు చేయాలని పోలీస్‌లను కోరారు.

నకిలీ చందా పుస్తకాలతో అక్రమ వసూళ్లు

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతా రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 6న నిర్వహించే శ్రీరామనవమి కల్యాణానికి ఉత్సవ కమిటీ పేరుతో ఓ వ్యక్తి నకిలీ పుస్తకాలు తయారు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు గుర్తించి రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం రాత్రి దేవాదాయ ధర్మదాయ శాఖ హైదరాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్ పాలకుర్తికి చేరుకొని విచారణ జరిపారు. ఈఓ మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

'అభివృద్ధిని చూసి మాట్లాడు'



జనగామ: జిల్లా అభివృద్ధితో పాటు స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి చేస్తున్నారని, రాజకీయాల్లో అనుభవజ్ఞుడు కడియం శ్రీహరిని విమర్శిస్తే ఊరుకునేది లేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాయలంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో వందల కోట్లతో అభివృద్ధి జరుగుతుంటే... ఓర్వలేని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కడియంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో పల్లా చేసిన అభివృద్ధి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని ఆరుద్రోత్సవం కార్యక్రమాన్ని అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పంచ హారతులతో గర్భాలయంలో దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, అర్చకులు డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్ కుమార్, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ నుంచి మినహాయించండి

జనగామ: ఎస్జీటీ టీచర్లకు పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల స్పాట్ వాల్యువేషన్ విధులు వేయడంపై వినతులు వెల్లువెత్తుతున్నాయి. కొత్త టీచర్లకు 'స్పాట్' డ్యూటీ శీర్షికన ఈ నెల 4న సాక్షిలో ప్రచురితం కాగా, జిల్లా వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఒక్కరు లేక ఇద్దరు పని చేసే ప్రాథమిక పాఠశాలల నుంచి స్పాట్ వాల్యువేషన్‌కు టీచర్లను వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి జవాబు పత్రాల వాల్యువేషన్ డ్యూటీలతో ఉపాధ్యాయులు బడికి రాకుండా పోయే పరిస్థితి ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టే అవకాశం లేకపోలేదని విద్యావేత్తలు భావిస్తున్నారు. శుక్రవారం పలువురు కొత్త టీచర్లు మండలాల పరిధిలో ఎంఈఓలతో పాటు డీఈఓలకు వినతులు అందించారు. జిల్లాలో స్పాట్ వాల్యువేషన్ డ్యూటీలకు సంబంధించి అధికారుల నిర్ణయంపై విమర్శలు వ్యక్తమవుతుండగా, భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరుగుతుంది.



ఈ ఫొటోల్లో ఆటవస్తువులపై ముళ్లకంచె వేసి ఉన్న పార్కు అంబేడ్కర్‌నగర్‌లోనిది. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈ పార్కులో ఒక్క మొక్క కూడా ఉండదు. ఆట వస్తువులన్నీ తుప్పు బట్టి పోయి పనికి రాకుండా పోతున్నాయి. పార్కులో ఆహ్లాదం ఏమో కానీ.. ముళ్ల కంపలతో కళా విహీనంగా మారింది. సాయంకాలం వేళ పిల్లలతో కలిసి పార్కుకు వెళ్తామనుకునే పట్టణ ప్రజలకు కనీసం చెట్టుకింద కూడా కూర్చునే పరిస్థితి లేదు. పార్కులో ఉన్న ఆట వస్తువులు దుమ్ముతో నిండిపోయి...అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. పార్కు అభివృద్ధికి గతంలో ప్రణాళిక చేసినా..కాగితాలకే పరిమితం చేశారు.



ఆహ్లాదం ఎక్కడ?

చెత్తకు నిలయంగా అంబేడ్కర్‌నగర్ పార్కు

- బతుకమ్మకుంటలో కంపుకొడుతున్న నీరు
- కుటుంబ సమేతంగా కాలక్షేపం చేయాలంటే పచ్చదనం కరువు
- పేరుకే జిల్లా కేంద్రం.. పార్కులకు దక్కని ప్రాధాన్యం

సాక్షి పరిశీలన

జనగామ: వేసవి వచ్చేసింది.. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కళాశాలల వార్షిక పరీక్షలు ఒక్కొక్కటిగా ముగిసి పోతున్నాయి... మరో ఇరవై రోజులు గడిస్తే సెలవులు రానున్నాయి... పిల్లలతో కలిసి కుటుంబ సమేతంగా కాసేపు కాలక్షేపం చేద్దామనుకుంటే జిల్లా కేంద్రంలో ఆహ్లాదం కరువైంది. పేరుకు జిల్లా హెడ్ క్వార్టర్... కనీసం పచ్చదనం కనిపించకుండా పోయింది. అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న ఒకే ఒక్క పార్కు పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలకు నిలయంగా మారి కళావిహీనంగా కనిపిస్తోంది. బతుకమ్మకుంట ఉన్నా.. నాలుగేళ్లుగా అందులో ఉన్న నీటిని రీఫ్రెష్ చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. అక్కడకు వెళ్తే ఆహ్లాదం ఏమో కానీ..అనారోగ్యం పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. 30 వార్డులు, 85 వేల జనాభా కలిగి ఉండి.. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న జనగామ పురపాలిక (జిల్లా కేంద్రం)లో కనీసం పది పార్కుల వరకు ఉండాలి. కానీ పార్కుల ఏర్పాటుపై వివక్షత.. అధికారుల నిర్లక్ష్యంతో ఉన్న ఒకే ఒక్క పార్కు సైతం కనుమరుగు చేస్తూ... పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా బయటకు వెళ్లలేని పరిస్థితికి తీసుకు వచ్చారు.



నెహ్రూపార్కులో చెత్తా, చెదారం



నెహ్రూ 'పార్కు' ఎక్కడ...?

జనగామ పట్టణానికి నెహ్రూపార్క్ ఐకాన్. స్వాతంత్య్రం రాకముందు నుంచే ఈ పేరు వాడకంలో ఉంది. ఒకప్పుడు పచ్చదనంనిండి... ఆహ్లాదకర వాతావరణంలో కనిపించే నెహ్రూపార్కు.... నేడు చెత్తకుప్పలతో నిండి... చుట్టూ ఫ్లెక్సీలు... ఫుట్‌పాత్ అమ్మకాలతో డంప్ యార్డుగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త వ్యక్తులు నెహ్రూపార్కు వద్ద నిల్చొని.. పచ్చదనం.. పార్కు కనిపించక పరేషాన్ అవుతారు. పార్కును అభివృద్ధి చేస్తామని కౌన్సిల్ సమావేశం జరిగినప్పుడల్లా ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప... ఆచరణలో చేసి చూపించలేక పోయారు.

పచ్చదనం కనిపించని 'చమన్'



ఆరు వార్డులకు ప్రధాన జంక్షన్ చమన్. ఇక్కడ గతంలో పచ్చదనంతో కాలనీల ప్రజలకు కాసింత ఆహ్లాదం కనిపించేది. గత కొంత కాలంగా పచ్చదనం పోయి.. 'చమన్' పేరుగానే పిలువబడుతుంది. ఇటీవల మాజీ కౌన్సిలర్ పాండు చొరవతో ఐ లవ్ యూ జనగామ సింబల్‌తో జంక్షన్ ఏర్పాటు చేసి కొంతమేర అభివృద్ధి చేసినా...పచ్చదనం సైతం ఉండేలా మినీ పార్కును ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది. చమన్ పేరుకు సార్థకత ఉండాలంటే పచ్చదనం, మినీ పార్కుగా మార్చాలని స్థానికుడు బండ సత్యనారాయణ కోరారు.

హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుంది..



అంబేడ్కర్‌నగర్‌లో పార్కు...పేరుకే పిలువ బడుతుంది. పిల్లలతో కలిసి వెళ్లే పరిస్థితి లేదు. అందులో మచ్చుకు పచ్చదనం కనిపించదు. ఆట వస్తువులు తుప్పుబట్టి పోతున్నాయి. సెలవులు వస్తే కుటుంబంతో సహ హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుంది. పార్కును అభివృద్ధి చేయాలి.

- ఆకుల సందీప్, 13వ వార్డు, జనగామ

పూర్వ వైభవం తీసుకురావాలి



నెహ్రూపార్కుకు పూర్వవైభవం తీసుకురావాలి. కూలిన గోడలను పునర్నిర్మాణం చేసి, అందులో పచ్చదనం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లాతో పాటు సమీప ప్రాంతాల నుంచి నిత్యం వందాలాది మంది ఇక్కడకు వస్తుంటారు. పార్కు ఏర్పాటు చేస్తే పట్టణానికి శోభ సంతరించుకోవడంతో పాటు నెహ్రూపార్కు పేరుకు సార్థకత కలుగుతుంది.

- రామిని శివుడు, వ్యాపారి, జనగామ

పార్కు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం..



పట్టణంలోని బతుకమ్మకుంటలో పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. నిధుల కొరత కారణంగా మిగతా వార్డుల్లో పార్కుల ఏర్పాటు చేయలేక పోతున్నాం. నిధుల సమీకరణను బట్టి పార్కులను ఏర్పాటు చేసి, పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తాం.

- వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

ధాన్యం కొంటున్నారు...

- ఏఎంసీలో ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభం
- ట్రేడర్లతో మూడుగంటల పాటు చర్చలు

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ట్రేడర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో చర్చల అనంతరం శుక్రవారం సాయంకాలం 3.45 గంటలకు ధాన్యం సేకరణ మొదలు పెట్టారు. 'కొనేవారేరి?' శీర్షికన ఈ నెల 4న సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సూచనలతో ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ హుస్సేన్ మార్కెట్‌కు వచ్చారు. మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేంద్ర, రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లు అడ్తిదారులతో మూడు గంటల పాటు చర్చలు జరిపారు.

సమస్య ఎక్కడంటే..

మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైతులకు నష్టం జరగకుండా గతేడాది క్వింటా ధాన్యం రూ.1,850 తగ్గకుండా మినిమం ధర నిర్ణయించారు. ఆ ధర తగ్గకుండా సరుకు నాణ్యత ఆధారంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విదేశాలకు బియ్యం ఎగుమతికి డిమాండ్ లేకపోవడం, క్వింటాకు రూ.500 తగ్గడంతో మినిమం ధర గిట్టుబాటు కాదని ట్రేడర్లు కొనుగోళ్లకు విముఖత చూపించారు. దీంతో రెండు రోజులుగా మార్కెట్‌లో వేలాది ధాన్యం బస్తాలు పేరుకు పోయాయి. ఈ విషయమై సాక్షిలో వచ్చిన కథనం మేరకు అధికారులు సమస్యను కొలిక్కి తీసుకు వచ్చేందుకు రంగంలోకి దిగారు. ట్రేడర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో ధర విషయమై మాట్లాడారు. మినిమం ధరను రూ.1,750కి తగ్గించాలని కోరగా... రూ.1,790 వరకు సాధ్యం అవుతుందని అధికారులు చెప్పగా.. వ్యాపారులు ఒప్పుకోలేదు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. అప్పటికే మధ్యాహ్నం 2 గంటలు దాటి పోవడంతో రెండు రోజులుగా నిరీక్షిస్తున్న రైతులు నిరసన తెలిపేందుకు మార్కెట్ వైపు దూసుకు వచ్చారు. అధికారుల తీరును తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ శివరాజ్



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ గోపీరాం, చైర్మన్ శివరాజ్, అధికారులు

రైతులకు నచ్చ చెప్పగా, గొడవ చేయకుండా ఓపిక పట్టారు. పరిస్థితిని పసిగట్టిన అధికారులు క్వింటా ధాన్యం రూ.1,750 కొనుగోలు చేసేలా అంగీకారం తెలుపడం.. వెంటనే ట్రేడర్లు సరుకు కొనుగోలు చేసేందుకు కవర్‌షెడ్, కళ్లంలోకి వెళ్లడంతో రైతులు శాంతించారు. సుమారు 100 మంది రైతుల వద్ద సుమారు 3వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయగా, మరో 7 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయి.

త్వరగా లిఫ్టింగ్

మరో రెండు రోజుల పాటు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా లిఫ్టింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల నుంచి అంగీకార పత్రం..

జనగామ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు రోజుల్లో వచ్చే సరుకులకు రైతుల నుంచి అంగీకార పత్రాన్ని తీసుకుంటున్నారు. మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. అయినప్పటికీ శుక్రవారం మార్కెట్‌కు పెద్ద ఎత్తున ధాన్యం తీసుకువచ్చారు. మార్కెట్‌కు సెలవు ప్రకటించిన సమయంలో తీసుకు వచ్చిన సరుకు అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదము, దొంగతనాలు, మరే ఇతర కారణాల చేత ధాన్యానికి నష్టం జరిగే మార్కెట్ కార్యాలయం, అధికారులకు ఎలాంటి బాధ్యత ఉండదని రైతులతో అంగీకార పత్రాన్ని రాయించుకుంటున్నారు. మార్కెటింగ్ అధికారి నరేంద్ర మాట్లాడుతూ సెలవు సమయంలో సరుకులను మార్కెట్‌కు తీసుకు రావద్దని సూచించారు.

'పల్లా'ది అహంకారం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: 'ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై చేసే ఆరోపణలు అహంకారంతో చేస్తున్నవి.. అతనో బొచ్చుకుక్కలాంటోడు.. అది కడుపు నిండితేనే అరుస్తుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నా రు. శుక్రవారం మండలంలోని శ్రీపతిపల్లి, మల్కాపూర్, చిన్నపెండ్యాల గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన చిన్నపెండ్యాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జెల దామోదర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులు మంజూరు తీసుకువచ్చి 29 శిలాఫలకాలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయించానని, ప్రస్తుతం ఆ పనులు కూడా మొదలయ్యాయన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతీ పనిలో లంచాలు తీసుకుని అభివృద్ధిలో నియోజకవర్గాన్ని వెనుక పడేశారు.. తాను అభివృద్ధి మొదలు పెట్టగానే భయంతో అసత్య ప్రకటనలు చేస్తున్నారు.. పూర్తి వివరాలను తెలిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని శ్రీహరి అన్నారు. ఎజెండా నా అభివృద్ధి.. చిత్తకార్తె కుక్కల్లా మొరిగితే తాను పట్టించుకోను.. అలాగే ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెపుతారనన్నారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ సరస్వతి, రామారావు, చీకటి వినీత్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

గంజాయి కేసుల్లో నేరస్తులను అరెస్టు చేయాలి



నేర సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: గంజాయి కేసుల్లో రవాణాకు పాల్పడే వ్యక్తులతోపాటు వారికి సరుకు అందజేసే.. స్వీకరించే వ్యక్తులను అరెస్టు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఫిబ్రవరి నెలకు సంబంధించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పిలిపించడమే కాకుండా అధికారులు వారిని వ్యక్తిగతంగా కలుసుకుని పరిసరాల్లో ఉండే వారి నుంచి రౌడీషీటర్ల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీయాలన్నారు. ఆస్తి నేరాలకు సంబంధించి జైలు నుంచి విడుదలయ్యే నిందితుల సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. ఈ నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ పోలీసులతో పాటు పోలీస్‌స్టేషన్ అధికారులు కూడా నిర్వహించాలని తెలిపారు. స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై అధికారులు తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీలు చైతన్య, మనాన్‌భట్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ రూరల్: ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అప్రోచ్ రోడ్, ప్లాట్ల మధ్య రోడ్లు సరిగా ఉండేలా పరిశీలించాలన్నారు. అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్

సన్నబియ్యం పంపిణీని వేగవంతం చేయాలి

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జనగామ రూరల్: రేషన్ దుకాణాలకు సన్నబియ్యం రవాణా పంపిణీని వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యం సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్నబియ్యం రవాణాపై కలెక్టర్‌లు దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయిలో కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పేదలతో కలిసి ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యంతో భోజనం చేయాలని మంత్రి సూచించారు. నూతన ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులతో సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. ఈ వీసీలో డీసీఎస్ఓ సరస్వతి, డీఎం సీఎస్ హతీరాం, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, అధికారులు

ఈవీఎం గోదాం పరిశీలన

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

'రాజీవ్ యువ వికాసం' యువతకు వరం



వివరాలు తెలుసుకుంటున్న ప్రీతమ్

రఘునాథపల్లి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం యువతకు వరం లాంటిదని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగాని ప్రీతమ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో యువ వికాసం హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నమోదైన దరఖాస్తుల వివరాలు ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుకు రూ.100 తీసుకుంటున్నారని కొందరు యువకులు చైర్మన్ దృష్టికి తీసుకరాగా, రూ.45 మాత్రమే తీసుకోవాలని.. అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మీ సేవ కేంద్రాల్లో అభ్యర్థుల వద్ద అదనపు రుసుం వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మండలంలోని కోమళ్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొందిన పాడి గెదెల యూనిట్‌ను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. చైర్మన్ వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బఫర్ గోదాంలో రేషన్ బియ్యం తనిఖీ



బియ్యం బస్తాను తూకం వేసి పరిశీలిస్తున్న అధికారులు

జనగామ: తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ నేపథ్యంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్, మేనేజర్ లక్ష్మారెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని బియ్యం నిల్వ చేసే బఫర్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సివిల్ సప్లయాస్ డీఎం హతిరామ్, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సివిల్ సప్లయాస్ నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి గోదాంతో పాటు పట్టణంలోని 11, 13 నంబర్ రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. అధికారులు, క్వాలిటీ, క్వాంటిటీ పరిశీలన చేసిన తర్వాత ఎంఎల్ఎస్ పాయింట్‌కు పంపిస్తారు. అక్కడ నుంచి రేషన్ దుకాణాలకు లిఫ్ట్ చేస్తారు. ఈ నేపథ్యంలో రేషన్ దకాణాలకు పంపించే 50 కిలోల బియ్యం బ్యాగులో తూకం తేడా వస్తుందని సాక్షి మెయిన్ పేజీలో ఈ నెల 4న ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. గోదాం, రేషన్ దుకాణాల్లో బస్తాలను తూకం వేసి హెచ్చుతగ్గులను పరిశీలించారు. ఎక్కడ కూడా ఎలాంటి తేడాలు లేవని నిర్ధారణ చేసుకున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ 5 ఏళ్ల లా కోర్సులో తాత్కాలిక పద్ధతిన వివిధ సబ్జెక్టుల్లో టీచింగ్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోషియాలజీ (1), పొలిటికల్ సైన్స్(1), లా సబ్జెక్టుల్లో బోధనకు(ఆరు) వేకన్సీలు ఉన్నట్లు తెలిపారు. ఎల్‌ఎల్‌ఎం, /ఎంఏ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. నెట్/సెట్ పాస్ లేదా పీహెచ్‌డీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ లా కాలేజీలో ఈనెల 8వ తేదీ వరకు అందజేయాలని పేర్కొన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు టీచింగ్ అనుభవం సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇది పార్ట్‌టైం నియామకం కాదని, వన్‌టైం సింగిల్ అరెంజ్‌మెంటుగా తాత్కాలిక పద్ధతిలో(2024–25)విద్యాసంవత్సరానికే (సెమిస్టర్) నియామకని పేర్కొన్నారు. ఒక సబ్జెక్టులో పేపర్‌వైజ్ ఐదు యూనిట్స్ సిలబస్ బోధిస్తే రెమ్యూనరేషన్ రూ.20వేలు చెల్లిస్తారని సుదర్శన్ తెలిపారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

- ఒకరి అరెస్టు, ఇద్దరు పరార్
- రూ.10,500, సెల్‌ఫోన్ స్వాధీనం

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో ఐపీఎల్ టీ–20 మ్యాచ్‌లపై బెట్టింగ్ చేస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి దాడులు జరిపారు. గీసుకొండకు చెందిన యాదగిరి గిరిధర్, దౌడు నితిన్, వంచనగిరికి చెందిన కావటి రాకేశ్ ఐపీఎల్ మ్యాచ్‌లో జట్ల గెలుపోటములు, బ్యాటింగ్, బౌలింగ్ చేసే వారిపై బెట్టింగ్ పెడుతున్న సమాచారాన్ని విశ్వసనీయంగా తెలుసుకుని వారిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో దౌడు నితిన్, కావటి రాకేశ్ పరారు కాగా.. యాదగిరి గిరిధర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,500, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గురుకుల విద్యాలయ జూనియర్ కళాశాలల్లో 2025–26లో ప్రవేశాలకు టీజీఆర్‌జేసీ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని టీజీఆర్‌జేసీ హసన్‌పర్తి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ఇందుమతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈఏడాది మార్చి–ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు http:tgrjc.cgg.govt. inలో చూడాలని తెలిపారు. ఇతర వివరాలకు 040–2473 4899, 98665 59727 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.



వేతనం రికవరీ చేయాల్సిందే!

విధులకు గైర్హాజరైన యూనియన్ నేత జీతం రికవరీకి ఎన్పీడీసీఎల్ నిర్ణయం

- విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులకు ఝలక్
- ఆదిలాబాద్ జిల్లాలో ఓ యూనియన్ నేత, జీతం చెల్లించిన డీఈ జీతం రికవరీ
- మెమో జారీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ఇప్పటికైనా నాయకుల్లో మార్పు వచ్చేనా?



హన్మకొండ : టీజీఎన్పీడీసీఎల్‌లో ఓ ఉద్యోగ సంఘం నాయకుడు విధుల హాజరు నుంచి పూర్తి స్థాయి మినహాయింపు లేకున్నా.. విధులకు హాజరు కాకున్నా పూర్తి స్థాయి వేతనం పొందాడు. అలాగే, సదరు సంఘ నాయకుడు విధులకు గైర్హాజరైనా ఓ డీఈ.. జీతం ఇచ్చాడు. దీనిపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి నివేదిక అందించారు. దీనిని పరిశీలించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి జీతం రికవరీ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకుల్లో కలకలం సృష్టించింది. ఝలక్ ఇచ్చింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ నాయకుడు ఎలాంటి ఫుల్ టైమ్ అనుమతి లేకుండా విధులకు హాజరు కాలేదని, అయినా అతడికి వేతనం చెల్లించడంతో సంస్థకు ఆర్థిక నష్టం చేకూరిందని పేర్కొంటూ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జీతం మొత్తం రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హెచ్‌ఆర్‌డీ విభాగం మార్చి 22, 2025 తేదీతో మెమో జారీ చేసింది.

2023లోనే రద్దయిన విధుల నుంచి మినహాయింపు..

విద్యుత్ శాఖలో యూనియన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యక్తికి ఆ యూనియన్ కార్యకలాపాల నిమిత్తం సమావేశాలకు హాజరయ్యేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయి మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ అటూ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్ సంస్థలు ఫుల్‌టైమ్ అనుమతి ఇచ్చేవి. ఈ విధానం 2022 డిసెంబర్ వరకు కొనసాగింది. 2023 సంవత్సరం నుంచి రద్దు చేశారు. 2022 వరకు రాష్ట్ర, కంపెనీ, జిల్లా స్థాయి ముఖ్య నాయకులకు ఫుల్‌టైమ్ అనుమతి ఉండేది. అయితే 2022 డిసెంబర్ 16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ సమావేశంలో నాలుగు విద్యుత్ సంస్థలు జెన్‌కో, ట్రాన్స్ కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదేని కంపెనీ నుంచైనా యూనియన్‌కు ఒక్కరు మాత్రమే ఫుల్ టైమ్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించాయి. దీంతో రాష్ట్ర, కంపెనీ, సర్కిల్ వారీగా గతంలో తీసుకున్న ఫుల్‌టైమ్ విధానం రద్దయింది. ఈ ఒక్కరిలో కూడా వర్క్‌మెన్ క్యాడర్‌కు సంబంధించిన ఉద్యోగి అయి ఉండాలని నిబంధన పెట్టారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు, ప్రావెన్షియల్ విభాగంలో అటెండర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వర్క్‌మెన్ క్యాడర్‌లోకి వస్తారు. అయితే పలు యూనియన్లకు వర్క్‌మెన్ పై స్థాయి క్యాడర్ కలిగి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాష్ట్ర స్థాయిలో కీలక పదవుల్లో ఉన్నారు. వీరితో పాటు సర్కిల్ స్థాయిలో పలువురు యూనియన్‌ల నాయకులు 2022 వరకు ఫుల్‌టైమ్ అనుమతి పొందారు.

యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు..

ఈ నిర్ణయం విద్యుత్ యూనియన్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫుల్‌టైమ్ విధానంలో మార్పులు చేర్పులు జరగకముందే గైర్హాజర్‌పై తీవ్రంగా స్పందించిన యాజమాన్యం ఇక ముందు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆందోళనలో యూనియన్ నాయకులున్నారు.

పాత అలవాటు ఇప్పటికీ కొనసాగింపు..

ఫుల్‌టైమ్‌లో నియంత్రణ విధించడంతో పాత అలవాటు ఇప్పటికీ కొందరు నాయకులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో యూనియన్ నాయకుల హాజరుపై ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం అప్పుడప్పుడు విచారణ చేపడుతోంది. కంపెనీ, సర్కిల్ స్థాయికి చెందిన యూనియన్ నాయకులు కొందరు ఇప్పటికీ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆదిలాబాద్ సర్కిల్‌లో జేఏఓ పి.గోపాల్ రావు 2019లో ఫుల్‌టైమ్ మినహాయింపు పొందాడు. అయితే ఆ తర్వాత కూడా 2020 జనవరి 1 నుంచి జూలై 30, 2021 వరకు ఎలాంటి అనుమతి, డ్యూటీ నుంచి మినహాయింపు లేకుండానే విధులకు గైర్హాజర్ అయ్యారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి నివేదిక అందించారు. పరిశీలించిన యాజమాన్యం గైర్హాజర్ అయిన కాలానికి రూ.31,25,715 రికవరీ చేయాలని నిర్ణయంతోపాటు ఒక వార్షిక ఇంక్రిమెంట్ నిలిపివేస్తూ మెమో జారీ చేసింది. ఇందులో సెలవులు రూపేణ రూ.12,01,815 మినహాయించి మిగతా రూ.19,23,900ను సంబంధిత ఉద్యోగి పి.గోపాల్ రావుతో పాటు, విధులకు గైర్హాజరైన జీతం ఇచ్చినందుకు అప్పటి డీఈ నుంచి రికవరీ చేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇద్దరి నుంచి రూ.9,61,950 చొప్పున రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయించింది.

రైతులకు అండగా ఉంటాం..

- పంట నష్టపోయినవారికి పరిహారం అందిస్తాం..
- రాష్ట్ర మంత్రి సీతక్క



వరి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలోని అమృతండా, చంద్రు తండా లక్ష్మీపురం, కర్లపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంట పొలాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క పరిశీలించారు. పంట పొలాలను పరిశీలించిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ఫోన్ చేసి పంట నష్టాన్ని వివరించి పరిహారం ఇవ్వాలని సీతక్క కోరారు. దీనికి స్పందించిన నాగేశ్వరరావు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సీతక్క తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటి పాలైందని అన్నారు. వెంటనే నష్టతీవ్రతను అంచనా వేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని తెలిపారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, టీపీసీసీ సభ్యుడు మల్లాది రాంరెడ్డి, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇస్సార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హన్మకొండ: రైతు సమస్యలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణ మాఫీ చేయడంలో విఫలమైందని విమర్శించారు. యాసంగి పంట కాలం పూర్తయి.. వానాకాలం సాగు సమీపిస్తున్నా ఇప్పటికీ యాసంగి కాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి రూ.6 వేలు క్రమం తప్పకుండా ఇస్తోందని చెప్పిన ఆయన.. కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అనేక వాగ్దానాలు చేసి ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నదని విమర్శించారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎంత మందికి రుణ మాఫీ జరిగిందో తెలియజేస్తూ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు చేయడంతోపాటు రైతు భరోసా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, వరంగల్, జేఎస్‌భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, నిశిధర్ రెడ్డి, సిరికొండ బలరాం, సౌడా రమేష్, నాయకులు వన్నాల శ్రీరాములు, రావు పద్మ, ఎరబ్రెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, మల్లాడి తిరుపతిరెడ్డి, రత్నం సతీష్, గోగుల రాణా ప్రతాపరెడ్డి, బైరి నాగరాజు, పుల్యాల రవీందర్ రెడ్డి, ఎం.విష్ణు, డాక్టర్ కాళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై చిన్న చూపు వీడండి

- సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

సాక్షి, మహబూబాబాద్ : గిరిజనులు అంటే ఇంకా సమాజంలో చిన్నచూపు ఉంది.. అధికారుల్లో కూడా అటువంటి ధోరణి ఉండటం సమంజసం కాదు.. చిన్న చూపు వీడి వారి అభ్యున్నతికి పాటుపడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలు, ఎస్టీలపై కేసులు మొదలైన అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పెద్ద అధికారుల వరకు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. భూ సమస్యలు పరిష్కరించకుండా సంవత్సరాల తరబడి గిరిజనులను తిప్పించుకుంటున్నారని అన్నారు. గిరిజన కాలనీల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నా.. వాటిని పరిష్కరించడం లేదని పలు సమస్యలను గుర్తు చేసి వినిపించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఐటీడీఏ పీడీ చిత్ర మిశ్రా, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయం

- సీజ్ చేసిన పోలీసులు





పోలీసులు సీజ్ చేసిన కూల్‌డ్రింక్స్

కమలాపూర్: కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఓ కిరాణా షాపు యజమాని ఫిర్యాదుతో పోలీసులు ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి కాలం చెల్లిన పలు రకాల కూల్‌డ్రింక్స్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కిరాణా షాపు యజమాని, కొనుగోలుదారులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌కు చెందిన కెంసారపు తిరుపతి అనే కిరాణా షాపు నిర్వాహకుడికి కమలాపూర్‌లోని కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకులు మౌటం ఓంప్రకాష్–హేమలత గత నెల 21న కొన్ని 200 ఎంఎల్ మజా బాటిళ్లు సరఫరా చేశారు. వాటిని తిరుపతి కొందరు కొనుగోలుదారులకు విక్రయించగా డేట్ ఎక్స్‌పైర్ అయినట్లుగా వారు గుర్తించారు. దీంతో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ ఎందుకు విక్రయిస్తున్నావని, ఇవి తాగితే తమ ప్రాణాలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ తిరుపతిని కొనుగోలుదారులు నిలదీశారు. దీంతో తిరుపతి తాను ఎక్స్‌పైర్ డేట్‌ను గమనించలేదని చెప్తూనే వెంటనే ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ ఎందుకిచ్చారని, వాటిని తీసుకెళ్లి వాటి స్థానంలో వేరే కూల్‌డ్రింక్స్ ఇవ్వాలని కోరాడు. దీంతో వారు తమకేమీ సంబంధం లేదని, కంపెనీ వాళ్లకు వాపస్ ఇచ్చుకోండంటూ దురుసుగా మాట్లాడటమే కాకుండా నానా దుర్భాషలాడారని తిరుపతి ఆరోపించాడు. అంతే కాకుండా కంపెనీ వాళ్లు ఇచ్చిన ఫ్రిజ్ బయట పెడితే తీసుకెళ్తామని ఫోన్లోనే వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులు వేచి చూసిన తిరుపతి గత నెల 31న కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 2న పోలీసులు కమలాపూర్‌లోని కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ గోదాంపై దాడులు జరిపి గోదాంలో నిల్వ ఉన్న కాలం చెల్లిన పలు రకాల కూల్‌డ్రింక్స్ తోపాటు వాటర్, సోడా బాటిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రూ.15,483 విలువైన కూల్‌డ్రింక్స్ సీజ్ చేసి, ఏజెన్సీ నిర్వాహకుడు ఓం ప్రకాశ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రారావు తెలిపారు. కాగా, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, వారి అండదండలతోనే ఈ తతంగమంతా నడుస్తోందని, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడికి అరుదైన గుండె శస్త్రచికిత్స



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ షఫీ

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో 77 ఏళ్ల వృద్ధుడికి వైద్యులు అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను వైద్యుడు షఫీ వెల్లడించారు. వరంగల్‌కు చెందిన వృద్ధుడు మామిడిపల్లి ముకుందాచారి ఇటీవల తీవ్రమైన గుండె నొప్పితో ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్, రైట్ కరోనరీ ఆర్టరీ, లెఫ్ట్ సర్కమ్ ఫ్లెక్స్ ఆర్టరీ, యాంటీరియర్ డిసెండింగ్ ఆర్టరీ, స్టెనోసిస్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈక్రమంలో డ్రగ్ ఎలుటింగ్ స్టెంట్, డ్రగ్ ఎలుటింగ్ బలూన్ గుండె శస్త్రచికిత్స నిర్వహించినట్లు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం వృద్ధుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు షఫీ వెల్లడించారు.

టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు, తదితరులు

పరకాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు అన్నారు. టెక్స్‌టైల్ పార్కులో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్‌బాబు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. పరకాల మున్సిపల్ సమావేశమందిరంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌లోని ఇండస్ట్రీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు స్కిల్ ట్రెనింగ్ సెంటర్ల ద్వారా స్థానికులకు నైపుణ్యం కల్పించి నియమించుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ లే అవుట్‌లో పట్టాలిచ్చిన 863 మంది రైతులకు వారి అభ్యర్థన మేరకు 50 గజాల నుంచి 75 గజాలు అందించేందుకు టీజీఐఐసీ ద్వారా అదనంగా రెండు ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. తిరిగి లేఅవుట్ ప్లాట్లు చేసి రాజీవ్ గాంధీ టౌన్ షిప్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈ జీడీపీ పథకం ద్వారా రూ.10.10 కోట్ల వ్యయంతో చేపట్టిన కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్స్, మంచినీటి సరఫరా, సంప్, పరిపాలన భవన నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయని, జూలై 2025 నాటికి పూర్తవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

గంజాయి, గుడుంబా నివారణకు చర్యలు

టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఉందని అలాంటి కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పరకాల నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాల ద్వారా 51 బ్యాచ్‌లలో 1,717 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి చేసుకున్న 82 మంది మహిళలకు మంత్రి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ పత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మల్లేశ్ (ఫైల్)

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఆవుల మల్లేశ్(30) రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని మంగళ సీడ్స్‌లో పని చేస్తున్నాడు. ప్రతీ రోజు మాదిరిగానే గురువారం పనికి వెళ్లి ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ధర్మసాగర్‌కు తిరిగి వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ రోడ్డు సమీపంలో వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ తల, గొంతు, కుడికాలుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మల్లేశ్ భార్య ఆవుల మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

పిల్లిని తీసేందుకు వెళ్లి..

- బావిలో పడి వృద్ధుడి మృతి



యాదగిరి (ఫైల్)

నెక్కొండ: చేద బావిలో పడిన పిల్లిని తీసేందుకు వెళ్లి వృద్ధుడు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల యాదగిరి (59) తన కుమార్తె కిరాయికి ఉంటున్న ఇంట్లోని చేద బావిలో పిల్లి పడి మృతి చెందింది. ఈ విషయాన్ని తన తండ్రి యాదగిరి చెప్పడంతో పిల్లి కళేబరాన్ని తీసేందుకు బావిలో దిగుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తాడు జారీ బావిలో పడిపోయాడు. దీంతో నీట మునిగిన వృద్ధుడు యాదగిరి మృతిచెందాడు. యాదగిరి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో శాయంపేట యువకుడి మృతి



మణికంఠ(ఫైల్)

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బండారి మణికంఠ(19) బాసరలోని శ్రీవేదభారతి పాఠశాలలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మణికంఠ బాసరలోని శ్రీవేదభారతి పాఠశాలలో రెండు సంవత్సరాలుగా చదువుతున్నాడు. మణికంఠ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడని శుక్రవారం మధ్యాహ్నం బాసరలోని వేద పాఠశాల సిబ్బంది మణికంఠ తండ్రి బండారి రాజేందర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో రాజేందర్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. తన కుమారుడు మణికంఠను ఎవరో కావాలని హత్య చేసి విద్యుత్ షాక్‌గా చిత్రీకరిస్తున్నారని తన కుమారుడి మృతిపై అధికారులు దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని రాజేందర్ కోరారు.

సంస్కృతీ, సంప్రదాయాలను వెలుగులోకి తేవాలి

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



సమ్మయ్యను సన్మానించిన వేణు బృందం

దేవరుప్పుల : తెలంగాణ ప్రాంత సినీ ప్రముఖులు ఇక్కడి జీవన విధానాలతోపాటు సంస్కృతి సంప్రదాయాలను మరింత వెలుగులోకి తీసుకరావాలని పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్య సూచించారు. బలగం సినిమా దర్శకుడు ఎల్దండి వేణు నిర్మించబోయే ఎల్లమ్మ సినిమా లొకేషన్ కోసం శుక్రవారం పాలకుర్తి ప్రాంతం పరిశీలించిన అనంతరం అప్పిరెడ్డిపల్లెలో సమ్మయ్య స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా వేణు చిందు యక్షగాన కళాకారులతో నాటకాలు వేయించి, సెలక్షన్స్ నిర్వహించారు. సమ్మయ్యను సన్మానించి సినిమాలో భాగస్వామ్యులు కావాలని కోరగా..అంగీకరించారు. తిరుపతి బృందం, సుధాకర్, కళాకారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్‌రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోరింగ్ తండా సమీపంలో దారుణహత్యకు గురైన దంతాలపల్లి ఎంజేపీ గురుకులం హెల్త్ సూపర్ వైజర్ తాటి పార్థసారథి హత్య కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పార్థసారథి హత్య జరిగిన రోజున అతడి సోదరి హేమవరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో మృతుడు పార్థసారథి భార్య స్వప్న, ఆమె ప్రియుడు వెంకటవిద్యాసాగర్‌ను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు విచారణలో భాగంగా ముగ్గురు నిందితులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం ఒప్పుకున్నారని తెలిపారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని గంగ హుస్సేన్ బస్తీకి చెందిన తెలగరి వినయ్ కుమార్, బోగ శివకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక గ్రామానికి చెందిన మోతుకూరి వంశీ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. గతంలో పార్థసారథిని హత్య చేయాలని జరిగిన రెక్కీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజావొమంగి మండలం జెడ్డంగి గ్రామానికి చెందిన కూసం లవరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో రూరల్, సీసీఎస్ సీఐలు సర్వయ్య, హత్తిరాం, రూరల్, కేసముద్రం ఎస్సైలు దీపిక, మురళీధర్ రాజు పాల్గొన్నారు.